## క్లుప్తంగా

### ప్రణవికి పీహెచ్‌డీ



వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ నుంచి పీహెచ్‌డీ అందుకుంటున్న ప్రణవి

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ, కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ నుంచి పీహెచ్‌డీని దాకే ప్రణవి వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ చేతుల మీదుగా శుక్రవారం అందుకున్నారు. 'ఆంధ్రప్రదేశ్‌లోని ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ప్రాంతాల్లో వనవాసుల సామాజిక - ఆర్థిక స్థితిగతులపై సంక్షేమ పథకాల ప్రభావం' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను ఈ పీహెచ్‌డీ పొందారని వీసీ తెలిపారు. ఈ పరిశోధనకు గైడ్‌గా డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ వ్యవహరించారు.

### తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం



విద్యార్థి ఫణి అజయ్‌ను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

రాజానగరం: గ్రామీణ ప్రాంత ఉపాధ్యాయుల్లో డయాబెటిక్ ఎఫ్ఈబీ-1 ప్లేట్‌లెట్ పారామీటర్లపై అధ్యయనం చేసి 'పీర్-రివ్యూడ్ జర్నల్'కు తన పరిశోధన పత్రాన్ని సమర్పించిన స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాల, ఎంబీబీఎస్ సెకండియర్ విద్యార్థి ఎస్.ఫణి అజయ్ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందాడు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకుకు చెందిన ఈ విద్యార్థి 19 సంవత్సరాల వయసు కేటగిరీలో ఈ అరుదైన గౌరవాన్ని అందుకున్నాడని ప్రిన్సిపాల్ ఎస్‌కే మిశ్రా తెలిపారు. ఆ విద్యార్థిని కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, సహ విద్యార్థులు అభినందించారు.

### సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

అనపర్తి: కొత్తూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జూనియర్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ ఎం.రాజు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ సీనియర్, జూనియర్ విభాగాల్లో సీట్ల ఖాళీల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. జూనియర్ ఇంటర్ బైపీసీలో ఎస్టీ-3, బీసీ-2, ఎస్సీ-6, సీనియర్ ఇంటర్‌లో ఎంపీసీలో ఎస్సీ-2, బీసీ-2, ఎస్టీ-2, సీనియర్ ఇంటర్ బైపీసీలో ఎస్సీ-27, బీసీ-2, ఎస్టీ-5, బీసీ (సీ)-4, ఓసీ-1 సీటు ఖాళీ ఉన్నాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ లోపు నేరుగా కళాశాలలో ప్రిన్సిపల్‌ను సంప్రదించాలన్నారు.

### నాగదేవతకు ప్రత్యేక పూజలు

కోరుకొండ: మండలంలోని గాడాల నాగదేవత ఆలయ మూడో వార్షికోత్సవం శుక్రవారం జరిగింది. ఆలయ గురువు నాగబాబు ఆధ్వర్యంలో ఉదయం నుంచి హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రవేశం జరిగింది. ఇందులో భాగంగా అమ్మవారికి భక్తులు అభిషేకాలు చేశారు.

### నేటి నుంచి రైతుల ఖాతాల్లో నగదు జమ

సీతానగరం: మండలంలోని రైతుల బ్యాంక్ ఖాతాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నగదు జమ కానున్నాయని మండల వ్యవసాయ శాఖాధికారి ఎ.గౌరీదేవి తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పీఎం కిసాన్ పథకంలో 6,328 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.2 వేలు, రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకంలో రూ.5 వేల చొప్పున 6,848 మంది రైతులకు బ్యాంక్ ఖాతాలో జమ కానున్నాయని వివరించారు.

పెదపూడి: మండలంలో అన్నదాత సుఖీభవ పథకానికి 6,929 మంది రైతులు అర్హత సాధించారని, వారి బ్యాంకు ఖాతాల్లో శనివారం నిధులు జమ కానున్నాయని మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ తెలిపారు. దోమాడ రైతు సేవా కేంద్రంలో రికార్డులను ఆయన పరిశీలించారు.

### సామాజిక పింఛన్ల పంపిణీ

పెదపూడి: మండలంలో శుక్రవారం చేపట్టిన సామాజిక పింఛన్ల పంపిణీ 90 శాతం పూర్తయ్యిందని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి తెలిపారు. ఆయన పెదపూడి, శహపురం గ్రామాల్లో, డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి గండ్రేడు, పెద్దాడ గ్రామాల్లో పింఛన్లు పంపిణీ చేశారు. సచివాలయ కార్యదర్శులు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బిక్కవోలు: కొంకుదురులో స్పౌజ్ పింఛన్‌ను అందించారు. ఇక్కడి పంచాయతీ కార్యాలయం వద్ద 22 మందికి సర్పంచ్ సత్తి వీరమణి, ఎంపీటీసీ సభ్యులు కొంకుదురు పీపీ, నల్లమిల్లి అమ్మిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చింతా శ్రీనివాసరెడ్డి, నీటి సంఘ అధ్యక్షుడు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కర్రి సత్యనారాయణరెడ్డి తదితరులు పింఛన్లు అందించారు.

## ప్రయాణం గండం..

# పాలకులకో దండం

- రాపాక రోడ్డులో నానా అవస్థలు
- గొప్పలొద్దు, గోతులు చూడండి
- నరకం చూస్తున్నామంటున్న ప్రయాణికులు



రాపాక - కోటికేశవరం రోడ్డులో భారీ గోతులు



గుంతలో కూరుకుపోయిన లారీ (ఫైల్)

సీతానగరం: అతుకులు.. గతుకులు.. రాళ్లు.. రప్పలు.. ఎక్కడికక్కడే మట్టికొట్టుకుపోయి నడ్డివిరిచేలా గుంతలు.. అటుగా వెళ్లేవారికి తిప్పలే తిప్పలు. ఆ రోడ్డులో జనం విసిగి 'వే'సారిపోతున్నారు.. నడిచేందుకే నరకం చూస్తున్నారు.. ఇక వాహనాలైతే ఉయ్యాల జంపాలను తలపించేలా ఊగుతూ వెళ్లాల్సిందే.. ఏదో ఒక గోతితో పడాల్సిందే.. గొప్పలు చెప్పుకొనే నేతలకు ఈ గోతులు కనిపించకపోవడంతో నిత్యం ప్రయాణం దినదిన గండంలా మారిందని జనం నిట్టూర్పు వదులుతున్నారు.. ఎన్నాళ్లీ ప్రయాణ గండం అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీతానగరం మండలంలోని రాపాక - కోటి కేశవరం రోడ్డు దుస్థితి ఇది. ఈ రోడ్డు ఎక్కడికక్కడే గుంతలతో దారుణంగా తయారైంది. రాపాక నుంచి రోడ్డుపై పెద్ద గోతులు పడ్డాయి. కేవలం మూడు కిలోమీటర్ల మేర రోడ్డు వేయలేని స్థితిలో కూటమి ప్రభుత్వం, ఆ పాలకులు ఉన్నారంటూ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'కూటమి' అధికారం చేపట్టి ఏడాదిన్నర అవుతున్నా ఈ రోడ్డును బాగుచేయలేకపోయింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు రోడ్లను వేస్తామంటూ గొప్పలు చెప్పారు. సంక్రాంతికి బంధువులు వస్తారు, వారి ప్రయాణం సుఖవంతంగా ఉండాలంటే రోడ్లకు మరమ్మతులు చేయిస్తామని ప్రకటించారు. అందులో భాగంగా అప్పట్లో రాపాక - కోటి కేశవరం రోడ్డును రాపాక శివారు నుంచి మూడు కిలోమీటర్లు వదిలి, మిగిలిన రోడ్డుకు మరమ్మతులు చేశారు. అది కూడా ఇప్పుడు శిథిలమైంది. రాపాక నుంచి మూడు కిలోమీటర్ల తారు రోడ్డును బాగుచేయకుండా అలానే వదిలేశారు. ఆ మూడు కిలోమీటర్ల నుంచి సిమెంట్ రోడ్డు ఉంది. అది కూడా శిథిలం కాగా దానిపై తారుతో పూడ్చివేశారు. సిమెంట్ రోడ్డు అనంతరం కోటికేశవరం వరకూ తారు రోడ్డుపై పడిన గోతులకు మాత్రమే మరమ్మతులు చేశారు. అది కూడా వర్షాలకు కొట్టుకుపోయింది. ఇలా మరమ్మతులను మమ అనిపించారు. సిమెంట్ రోడ్డు నుంచి రాపాక వరకూ మూడు కిలోమీటర్ల రోడ్డు గోతులుపడి వాహనదారులు నరకం చూస్తున్నారు.

**గుంతలో కూరుకుపోయి..**

గత నెల 24న కోరుకొండ నుంచి వస్తున్న సివిల్ సప్లయిస్ లారీ రాపాక వద్ద రోడ్డుపై గుంతలో కూరుకుపోయింది. మర్నాడు లారీలో ఉన్న సరకులు కిందకు దింపిన అనంతరం పొక్లెయిన్ సాయంతో లారీని బయటకు లాగారు. ఇలా చాలామంది ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డు నుంచి కోరుకొండ, గోకవరం మండల గ్రామాలకు అనేక మంది వెళ్తుంటారు. కార్లపై వెళ్లేవారు ఈ రోడ్డు నుంచి కాకుండా కాతేరు నుంచి మధురపూడి విమానాశ్రయం రోడ్డు మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. కేవలం ద్విచక్ర వాహనదారులు మాత్రమే అతి కష్టంపై ఇటుగా ప్రయాణం సాగిస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### రోడ్డు ఎప్పుడు వేస్తారో..



రాపాక - కోటికేశవరం ఆర్‌అండ్‌బీ రోడ్డును ఎప్పుడు వేస్తారో తెలియడం లేదు. ఇటుగా ప్రయాణం నరకప్రాయంగా మారింది. రాపాక నుంచి మూడు కిలోమీటర్ల తారు రోడ్డుపై భారీ గోతులు పడ్డాయి. ద్విచక్ర వాహనాలు నడపడం కత్తిమీద సాములా మారింది. తారురోడ్డు అనంతరం సిమెంట్ రోడ్డుపై కూడా గుంతలు పడి వెళ్లేందుకు వీలు లేకుండా ఉంది.

–ఎస్.శివనాగరాజు, లంకూరు

### ప్రయాణం.. భయం భయం



రాపాక- కోటికేశవరం రోడ్డుపై ప్రయాణం అంటేనే భయంగా మారింది. కేవలం మూడు కిలోమీటర్ల రోడ్డు వేయలేక పోతున్నారు. భారీ గోతులు పడి వాహనాలు వెళ్లడానికి వీల్లేకుండా ఉంది. కనీసం మరమ్మతులు చేయడం లేదు. కార్లపై ఈ రోడ్డు నుంచి వెళ్లడం కష్టం అవుతుంది. తక్షణమే రోడ్డు వేయాలి. లేకుంటే గోతులను పూడ్చించాలి.

–బైర్రాజు మురళీరాజు, సీతానగరం

### వృద్ధుడి అదృశ్యం



డేగల చినవీర్రాజు (ఫైల్)

రాజానగరం: వెలుగుబందకు చెందిన డేగల చినవీర్రాజు (80) రెండు రోజులుగా కనిపించడం లేదు. బుధవారం సాయంత్రం 4.30 గంటల సమయంలో దివాన్‌చెరువులోని ఆస్పత్రికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి ఇంతవరకు తిరిగి రాలేదని స్థానిక ఎస్సై నారాయణమ్మ తెలిపారు. అతని ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు రెండు రోజులుగా గాలిస్తున్నారు. అతని మనుమరాలు డేగల విజయలక్ష్మి శుక్రవారం తమకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు. అతని ఆచూకీ తెలిసిన వారు 94407 96585, 94410 23561లకు ఫోన్ చేయాలని ఎస్సై కోరారు.

### నేడు లక్కీ డ్రా

కోరుకొండ: స్థానిక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మండపంలో ఈ నెల 2న, శ్రీరంగపట్నం పంచాయతీ గోడౌన్ వద్ద 3న బంగారు వరలక్ష్మి కానుక లక్కీ డ్రా నిర్వహించనున్నట్లు విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహిళల్లో హైందవ చైతన్యాన్ని తీసుకు రావాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. గత సంవత్సరం పేర్లు నమోదు చేసుకున్న మహిళలు స్లిప్పులను వెంట తీసుకు రావాలన్నారు. లక్కీడ్రా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జరుగుతుందని ఆయన వివరించారు.

## భాషా నైపుణ్యం అవసరం



ఇంగ్లిష్ సర్టిఫికేషన్ అండ్ అప్ స్కిల్ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులతో అధ్యాపకులు

రాజానగరం: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి భాషా నైపుణ్యం ఎంతో అవసరమని స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) అన్నారు. కేంబ్రిడ్జి యూనివర్సిటీ అందిస్తున్న ఇంగ్లిష్ సర్టిఫికేషన్ అండ్ అప్ స్కిల్ పరీక్షలో ఉత్తీర్ణులైన 9 మంది జీజీయూ విద్యార్థులను అభినందిస్తూ యూనివర్సిటీ శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బహుళ జాతి సంస్థల్లో ఉద్యోగాలు పొందేందుకు ఇటువంటి నైపుణ్యాలు ఎంతగానో తోడ్పడతాయన్నారు. వీసీ డాక్టర్ కేవీబీ రాజు, హెచ్‌ఓడీ డాక్టర్ సంఘమిత్ర, అధ్యాపకులు శైలజ, మహాలక్ష్మి, పాండు, డీన్ డాక్టర్ బి.శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

### బకాయిల వసూళ్లలో బిజీబిజీ

కోరుకొండ: రైతులకు సాగులో సహకారం అందించేందుకు సహకార సంఘాలను ఏర్పాటు చేశారు. అయితే ఈ సంఘాల ద్వారా అందించిన రుణ బకాయిల వసూలు పనుల్లో సొసైటీ అధికారులు బిజీగా ఉన్నారు. పెద్ద మొత్తంలో బకాయిలున్న బడాబాబులు తిరిగి చెల్లించడంలో జాప్యం చేస్తున్నారు. కోరుకొండ మండలంలో ఐదు సహకార సంఘాలు (పీఏసీఎస్)ఉన్నాయి. ఇందులో గాడాల, బూరుగుపూడి, దోసకాయలపల్లి, కోరుకొండ, శ్రీరంగపట్నం సొసైటీలు ఉన్నాయి. రుణాలు తీసుకున్నవారి నుంచి బకాయిల వసూలుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అయితే సన్న, చిన్నకారు రైతుల నుంచి వసూలు చేసినంతగా, రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, ధనిక రైతుల నుంచి వసూలు చేయలేకపోతున్నారనే విమర్శలున్నాయి. పేద రైతులకు వ్యవసాయ పెట్టుబడి సీజన్ కావడంతో ఈ రికవరీలు ఇబ్బందిగా ఉన్నాయని వారు ఆవేదన చెందుతున్నారు.

## తల్లి పాలు బిడ్డకు అమృతం



రాజానగరంలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు



రంగంపేట పీహెచ్‌సీ వద్ద అవగాహన కార్యక్రమంలో డాక్టర్ వేణుశ్రీలక్ష్మి

బిక్కవోలు: తల్లి పాలు బిడ్డకు అమృతం వంటివని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ అన్నారు. కాపవరం గ్రామంలోని 91వ అంగన్‌వాడీ కేంద్రం వద్ద తల్లి పాలు వారోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటేనే శిశువు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త ఝాన్సీలక్ష్మి, సీహెచ్‌వో శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

రాజానగరం: తల్లి పాల ఆవశ్యకతను తెలియజేస్తూ స్థానిక పీహెచ్‌సీ వైద్య సిబ్బంది జీఎస్ఎల్ నర్సింగ్ విద్యార్థులతో కలసి రాజానగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. గాంధీబొమ్మ సెంటర్‌కు చేరుకుని మానవహారంగా ఏర్పడి 'డబ్బా పాలు వద్దు - తల్లి పాలు ముద్దు' అంటూ నినాదాలిచ్చారు. వైద్యులు సీహెచ్ వెంకటలక్ష్మి, పీహెచ్ఎన్ మంగతాయారు, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్ వీవీ రమణ, జీఎస్ఎల్ నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ గీతాప్రవీణ, వైస్ ప్రిన్సిపాల్ కె.విజయపల్లవి, ఎన్ఎస్ఎస్ పీఓ జి.మాలిని పాల్గొన్నారు.

**రంగంపేటలో..**

రంగంపేట: బిడ్డకు తల్లి పాలు ఎంతో శ్రేష్టమైనవని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.వేణుశ్రీలక్ష్మి అన్నారు. స్థానిక పీహెచ్‌సీ వద్ద తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లి పాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన ఆరు నెలల వరకూ తల్లిపాలు అందిస్తే శిశువుల శారీరక, మానసిక అభివృద్ధి బాగుంటుందన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ కె.చిన్నారావు, పీహెచ్ఎన్ కె.మేరీ హెలెనా, ఎంపీహెచ్ఈఓ వి.తులసీదాస్, ఎంపీహెచ్ఎస్ కె.రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు



బలభద్రపురంలో సత్తెమ్మ తల్లి



రంగంపేటలో కొలువైన విజయదుర్గాంబికాదేవి

బిక్కవోలు: శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా మండలంలోని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతాలు చేశారు. బలభద్రపురం సత్తెమ్మ తల్లి, బిక్కవోలులో పార్వతీదేవి, పందలపాకలో కట్లమ్మ తల్లి, కొమరిపాలెంలో కనకదుర్గమ్మ, తొస్సిపూడిలో నవదుర్గమ్మ, ఊలపల్లిలో కనకదుర్గమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

**విజయ దుర్గాంబికాదేవికి..**

రంగంపేట: స్థానిక మంచినీటి చెరువు వద్ద విజయ దుర్గాంబికాదేవి ఆలయంలో శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు కోడూరి నారాయణశర్మ ఆధ్వర్యంలో తెల్లవారు జామునే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రామచంద్రరావు కుమారుడు రాంబాబు అమ్మవారి ప్రసాదంగా పులిహోర వితరణ చేశారు.

### చట్టాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న మహిళా పీఎస్ ఎస్సై అమీనాబేగం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ అమీనా బేగం అన్నారు. జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ ఆదేశాల మేరకు స్థానిక జాంపేటలోని నేషనల్ సీనియర్ బేసిక్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సైబర్ నేరాలు, చట్టాలు, శక్తి యాప్‌లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అమీనా బేగం మాట్లాడుతూ ప్రజల పరిరక్షణ కోసమే ప్రభుత్వం శక్తి యాప్‌ను ప్రవేశపెట్టిందని, ఎవరైనా ప్రమాదాలు ఉన్నప్పుడు ఈ యాప్ ద్వారా సమాచారాన్ని క్షణాల్లో పోలీసులకు అందజేయవచ్చన్నారు. గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. మహిళా పీఎస్ ఎస్ఐ ఎంవీఆర్ రెడ్డి, మహిళా ఏఎస్ఐ, సైబర్ క్రైమ్ స్టాఫ్ రమేష్, ప్రసాద్, ఎన్ఎస్‌బీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు సింహాద్రిరావు తదితరులు పాల్గొన్నారు.

## పురస్కారాల ప్రదానం



పాలమూరులో స్మారక సభలో ప్రసంగిస్తున్న మంత్రి రామానాయుడు

అనపర్తి: దివంగత మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి మూలారెడ్డి తృతీయ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం ఆయన పేరున పురస్కారాలు అందజేశారు. పాలమూరు ఎస్వీఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో తొలుత మూలారెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పించారు. సాహితీవేత్త కవి బేతవోలు రామబ్రహ్మంకు నల్లమిల్లి మూలారెడ్డి సాహితీ పురస్కారాన్ని, మానసిక వైద్య నిపుణుడు కర్రి రామారెడ్డికి నల్లమిల్లి మూలారెడ్డి విజ్ఞాన పురస్కారం ప్రదానం చేశారు. అవార్డు గ్రహీతలకు రూ.50 వేలు, అభినందన పత్రం, మెమెంటో అందజేశారు.

- దుప్పలపూడిలో దివంగత ఎన్టీఆర్, నల్లమిల్లి మూలారెడ్డి విగ్రహాలను నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, మాజీ మంత్రులు యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్సీ వీవీవీ చౌదరి, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలోని ఆర్ఎస్‌పేట వద్ద మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి మూలారెడ్డి విగ్రహావిష్కరణ జరిగింది. శుక్రవారం ఆయన మూడో వర్ధంతి సందర్భంగా మూలారెడ్డి తనయుడు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విగ్రహావిష్కరణ చేశారు.

## మహిళల ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలి



జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటరమణ


రాజమహేంద్రవరం సిటీ: పట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల్లో మహిళల ఆర్థిక స్థితిని మెరుగుపరిచేందుకు కృషి చేయాలని మెప్మా జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.వెంకట రమణ సూచించారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఆయన శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో మెప్మా ద్వారా స్వయం సహాయక సంఘాలకు అందుతున్న పలు పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 10,852 స్వయం సహాయ సంఘాలు ఉన్నాయన్నారు. ఆర్పీలు ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా రుణాలు మంజూరు చేయించాలని, ఎక్కడ అవినీతి జరిగినా సహించబోమని హెచ్చరించారు. మొబైల్ మార్ట్‌లు, ర్యాపిడో వెహికల్స్, తృప్తి క్యాంటీన్, టూరిజం సర్వీసెస్, అమృతమిత్ర వంటి స్పెషల్ ప్రాజెక్టులను ప్రారంభించడం ద్వారా ఎక్కువ మంది మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగే అవకాశం ఉందన్నారు. అలాగే పీఎం సూర్య ఘర్ ఎంతో మంచి పథకమని, జిల్లాలోని ప్రజలు విరివిగా వినియోగించుకునేలా ప్రతి ఇంటికి పథకాన్ని తీసుకువెళ్లేలా అధికారులు చొరవ చూపాలన్నారు. జిల్లా టెక్నికల్ ఎక్స్‌పర్ట్స్ ఎం.ఫణికుమార్, పి.శ్రీదేవి, సీఎంఎంలు వి.రామలక్ష్మి, ఎ.జ్యోతి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

### పలుకు విద్యార్థులకు భోజన వితరణ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఐటీసీఎల్‌లో ఉన్న పలుకు ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు వైఎస్సార్ సీపీ యువజన విభాగ నాయకుడు నక్కా రాజేంద్ర జన్మదినం సందర్భంగా భోజన వితరణ చేశారు.

### యథేచ్ఛగా పోలవరం గట్టు తవ్వకాలు

- అడ్డుకున్న స్థానికులు
- సీతారాంపురంలో ఘటన



మట్టి అక్రమంగా తరలిస్తున్న లారీ

కోరుకొండ: నియోజకవర్గంలో మట్టి, ఇసుక దోపిడీ యథేచ్ఛగా సాగుతుంది. మట్టిని అక్రమంగా తరలిస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. ఆరు నెలలుగా జరుగుతున్న ఈ తంతును రాజానగరం మండలం కలవచర్లకు చెందిన దాట్ల రఘు ఆధ్వర్యంలో స్థానికులు అడ్డుకుని మైనింగ్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆ అధికారులు పోలీసుల సాయంతో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తహసీల్దార్ గరగ సత్యవతి, ఎస్సై నాగార్జున, మైనింగ్ ఏడీ ఫణిభూషణ్‌రెడ్డి వాస్తవాలను గుర్తించి, చర్యలు తీసుకుంటామన్నారు. వాహనాలను సీజ్ చేస్తామని తహసీల్దార్ తెలిపారు. కలవచర్లలోని పోలవరం కాలువగట్లపై మట్టి దోపిడీ సాగుతోంది. కూటమి ప్రభుత్వంలోని వ్యక్తులు రూ.12 లక్షల అక్రమార్జనకు పాల్పడ్డారు. దీన్ని సహించలేని స్థానికులు వివిధ సందర్భాల్లో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. చివరికి స్థానికులే అడ్డుకున్నారు. కార్యక్రమంలో కలవచర్ల ఉప సర్పంచ్ ఆదం పకీర్, నాయకుడు సుంకర శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఈ మట్టి లారీల వల్ల రహదారి గోతులమయమైంది.

**పంట పొలాలకు బూడిద**

రహదారికి ఇరువైపులా ఉన్న పంట పొలాలన్నీ ధూళి ఆవరించి తెగుళ్లు సోకుతున్నప్పటికీ వ్యవసాయ అధికారులు కనీసం స్పందించకపోవడం చర్చనీయాంశమవుతోంది.

## బిజీనెస్..

- వరుస పండగలతో సందడిగా మార్కెట్
- పెళ్లిళ్లు, శుభ కార్యాలతో పెరిగిన కొనుగోళ్లు



కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న నగరంలోని ప్రధాన రహదారి

ప్రకాశంనగర్: రాజమహేంద్రవరం.. వ్యాపార కేంద్రం. అలాంటి నగరానికి వరుస పండగలతో మరింత శోభ వచ్చింది. మార్కెట్ కళకళలాడుతోంది.. బంగారు, వస్త్ర, పూల తదితర వ్యాపారం ఊపందుకుంది.. బిజినెస్ ఒక్కసారిగా పెరిగింది.. శ్రావణమాసం రావడంతో ఇప్పటికే వరలక్ష్మీ వ్రతాలతో వివిధ వ్యాపారులకు గిరాకీ ఏర్పడింది. అలాగే ఈ నెలంతా పండగలు ఉండడంతో వ్యాపారాలకు సందడి వచ్చింది. శుభకార్యాలతో పాటు పండగల నేపథ్యంలో మార్కెట్ కళకళలాడుతోంది. ఈ నెల 3న ఫ్రెండ్‌షిప్ డే, 5న మంగళగౌరీ వ్రతం, 8న వరలక్ష్మీ వ్రతం, 9న రాఖీ పౌర్ణమి, 15న స్వాతంత్ర్య దినోత్సవం, 16న కృష్ణాష్టమి, 27న వినాయక చవితి పండగలు వచ్చాయి. దీంతో ఆయా వ్యాపారాలకు డిమాండ్ ఏర్పడింది. మహిళలు అత్యంత భక్తితో వరలక్ష్మీ వ్రతం జరుపుకొంటారు. అలాగే అన్నా చెల్లెలు, అక్కా తమ్ముళ్లు రాఖీ పండగకు అధిక ప్రాధాన్యం ఇస్తుంటారు. ఇలా పండగలకు ప్రధానమైన సామగ్రి కొనుగోళ్లతో నగరంలోని ప్రధాన మార్కెట్ సందడిగా మారింది. జిల్లా వాణిజ్య కేంద్రమైన రాజమహేంద్రవరంలో వస్త్ర, బంగారు, కిరణా, ఫ్యాన్సీ పూజా సామగ్రి కొనుగోలు దుకాణాలు రద్దీగా ఉంటున్నాయి. నగర వాసులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలతో మార్కెట్ కిటకిటలాడుతోంది. స్థానిక మెయిన్ రోడ్డు, గుండువారి వీధి, నల్లమందు సందు, టౌన్ హాలు రోడ్డు, సీతమ్మ సందు వంటి ప్రధాన సెంటర్లలో జనం రద్దీతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. వస్త్ర వ్యాపారానికి పేరుగాంచిన తాడితోటలోని మహాత్మా గాంధీ హోల్‌సేల్ క్లాత్ కాంప్లెక్స్, చందన మార్కెట్ ప్రాంతాల్లో దుస్తుల అమ్మకాలు జోరందుకున్నాయి. అలాగే షాపింగ్ మాల్స్ కిటకిటలాడుతున్నాయి.

**ప్రత్యేక ఆఫర్లు అంటూ హడావుడి**

శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని తమ అమ్మకాలను పెంచుకునేందుకు నగరంలోని పలు కార్పొరేట్ వస్త్ర దుకాణాలు, జ్యూయలరీ షాపులు ప్రత్యేక ఆఫర్లు ఇచ్చి వినియోగదారులను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఎంత బంగారం కొనుగోలు చేస్తే అంత వెండి ఉచితం, బంగారు ఆభరణాల కొనుగోలుపై తరుగు, మజూరీల్లో రాయితీ వంటి ఆఫర్లను అందిస్తున్నాయి. కొన్ని షాపింగ్ మాల్స్‌లో ఒకటి కొంటే మరొకటి ఉచితం, కొనుగోలుదారులకు లక్కీ డ్రా, బంపర్ డ్రా అంటూ ఆఫర్లు అందిస్తున్నారు. వాటితో పాటు ప్రత్యేక డిస్కౌంట్‌లను ఇవ్వడంతో జనం షాపింగ్ మాల్స్‌లో దుస్తులు, బంగారు నగలను కొనుగోలు చేసేందుకు క్యూ కడుతున్నారు.

**అన్ని రంగాల్లో జోష్**

మౌఢ్యమి, ఆషాఢ మాసం కారణంగా ఇప్పటి వరకూ పెళ్లిళ్లు, శుభకార్యాలు లేవు. ఇప్పుడు శ్రావణ మాసం ఆగమనంతో ముహూర్తాలు ఉండటంతో కల్యాణ మండపాలు, క్యాటరింగ్ పనులు చేసేవారికి డిమాండ్ వచ్చింది. వంట మనుషులు, సప్లయి కంపెనీ, లైటింగ్, డెకరేషన్ కార్మికులు, ఫంక్షన్ హాలులో పనిచేసే కార్మికులకు ఉపాధి దొరుకుతుందని కార్మికులు చెబుతున్నారు.

### వ్యాపారం ఊపందుకుంది



గత ఆషాఢంతో పోలిస్తే ఇప్పుడు శ్రావణంలో వ్యాపారాలు ఊపందుకున్నాయి. వస్త్ర రంగంలోకి కార్పొరేట్ సంస్థల రాకతో చిరు వ్యాపారుల మనుగడ ప్రశ్నార్థకమైంది. కార్పొరేట్ వ్యాపార సంస్థలు ప్రత్యేక ఆఫర్లు, డిస్కౌంట్లు ప్రకటించడంతో సామాన్యులు సైతం షాపింగ్ మాల్స్‌కు క్యూ కడుతున్నారు. దీంతో చిరు, మధ్య తరగతి వ్యాపారాలు దెబ్బతింటున్నాయి. ఒక్కోసారి వ్యాపారాలు లేక షాపు అద్దె, కరెంట్ బిల్లులు, జీతాలు వంటివి భారంగా మారుతున్నాయి.

– సత్యనారాయణ, వస్త్ర వ్యాపారి